# మనము శాంతి దూతలు కావాలి!

**నేను వెలుగులోనున్నాను వెలుగునేనె**
**వెలుగు నాలోన నున్నది వెలుగునేనె**
**అన్న భావము హృదయాన హత్తుకొన్న**
**అట్టిమనుజుడె బ్రహ్మలోనైక్యమగును**
**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగ మయ**

అని ఉపనిషద్వాక్యము.

విద్యార్థులారా!

యీనాటి పరిస్థితుల ప్రభావము పురస్కరించుకొని తమస్సునుంచి వెలుగునకు తీసుకుపొమ్మని, అసత్యమునుంచి సత్యమునకు గొనిపొమ్మని, మృత్యుత్వమునుండి అమృతత్వానికి చేర్చుమని ప్రార్థించటము యిది ద్వైతముయొక్క లక్షణము. ఇది యీనాటి పరిస్థితులకు, యీ ప్రభావమునకు సరైన మార్గము నందించదు. ఎంతకాలమైనా ఒకే తరగతియందు వుండిన విద్యార్థికి భవిష్యత్ యేమాత్రముకూడను ఆనందమును అందించదు. మన జీవితమంతయు ద్వైతముతోనే ప్రయాణము సలిపిన ఎప్పుడు మన గమ్యమైన అద్వైతమునకు చేరటము?

**అహంకారము వున్నంతవరకు సత్యధర్మశాంతిప్రేమ అహింసలను మనము దర్శించలేము**

ద్వైతము కల్పితమే కాని యిది సత్యముకాదు. సత్యమైన అద్వైతమును వదలి అసత్యమైన ద్వైతాన్ని మనము అనుసరిస్తున్నాము. కనుక, అద్వైతమునకు చేరే మార్గమును

sri sathyasai vachanamrutam

అనుసరించటానికి మనము ప్రయత్నించాలి. సత్య, ధర్మ, ప్రేమ, శాంతి, అహింసలు మనము ప్రదర్శించుచున్నామేగానీ దర్శించటంలేదు. పవిత్రమైన ఈ పంచగుణములను మనము దర్శించాలి, ఆచరించాలి. ప్రదర్శనలతో ఫలితము మనకు యేమాత్రము కనుపించదు. అంతటా అన్నిటా తాను గౌరవించబడవలెనని మానవుడు ఆశిస్తున్నాడే కాని, తాను యితరులను గౌరవించటానికి ప్రయత్నించటం లేదు. ఇతరులను గౌరవించటానికి తాను ప్రయత్నించినప్పుడే యితరులనించి తాను గౌరవాన్ని అందుకొనే అధికారి కాగలడు. ఇది ప్రాకృతమైన అహంస్వరూపము. ఇది వుండినంతవరకుకూడను సత్యధర్మశాంతిప్రేమఅహింసలను మనము దర్శించలేము. కనుక మొట్టమొదట ఆచరించి, అనుభవించి, ఆనందించి పదిమందికి అందించటానికి తగిన శక్తిసామర్థ్యములు సాధించాలి.

### తలంపులులేని స్థితియే శాంతి

ప్రతి మానవుడు తాను శాంతిని ఆశిస్తున్నాడు. అయితే, శాంతి అన్నది వేరే ఒక ప్రదేశమునందు లేదు. శాంతి అనే దానిని బయట వెదకటము కాలమును వ్యర్థము చేయటమే! శాంతి అన్నది మనలో వున్నదికాని బాహ్య ప్రపంచములో లేదు. అట్టి శాంతిని మనము వెలుపల వెదకటానికి ప్రయత్నించటంచేతనే లేనిపోని అశాంతిని అనుభవిస్తున్నాము. ఈ శాంతిని మొట్టమొదట తనలో అభివృద్ధిగావించుకోవాలి. కుటుంబములోపల అభివృద్ధిపరచాలి. కుటుంబమునుండి గ్రామానికి అభివృద్ధిగావించాలి. గ్రామమునుంచి రాష్ట్రానికి పెంచాలి. రాష్ట్రమునుంచి దేశమునకు అందించాలి. వ్యక్తియందు శాంతిలేనప్పుడు దేశము యేవిధముగా శాంతి అందుకుంటుంది? దురదృష్టవశాత్తూ యీనాడు శాంతిని విశ్వవ్యాప్తిగావించటానికి విరుద్ధముగా తనలోవున్న అశాంతిని కుటుంబములో వ్యాప్తిగావించటము, కుటుంబములోవున్న అశాంతిని గ్రామములో, తరువాత గ్రామమునుంచి దేశమువరకును అశాంతిని పెంచుచున్నామేగాని శాంతిని పెంచటానికి యెవరూ తగిన ప్రయత్నము చేయటంలేదు. మనము శాంతిని పెంచే



srisathyasaivachanamrutam

దూతలమే కాని, అశాంతిని పెంచే యమదూతలము కాకూడదు. కనుక శాంతిని పెంచటానికి తగిన పోషణ తనకు తాను అభివృద్ధిపరచుకోవాలి. ఈ శాంతి మనకు యెక్కడ లభిస్తుంది? సేవలయందు మాత్రమే లభిస్తుంది. సేవ చేయని మానవుని మనస్సు devil's workshop అన్నారు. పనిలేనివాడు కేవలము ఒక మొద్దుగా కూర్చుంటాడు. అలాంటి వ్యక్తికి నిద్రకూడను రాదు. నిద్రలేనివాడు క్షుద్రాలు పన్నుతాడు. అనవసరమైన తలంపులు అతని బుఱ్ఱలో చేరుతాయి. కనుక వాడు ఒక పిచ్చివాడుగా రూపొందుతాడు. మనము పని చేస్తూవుంటుంటే యే చింతలకుగాని తలంపులకుగాని యిందులో అవకాశము వుండదు. తలంపులులేని స్థితియే శాంతి.

## ప్రేమ అమృత స్వరూపము

శాంతిచేతనే ప్రేమ అభివృద్ధిగాంచుతుంది. ఈ ప్రేమ మనయందు సహజముగనే వున్నది. వున్న మొక్కను మనము పోషించుకోవాలంటే యెరువు వెయ్యాలి. నీరు పొయ్యాలి. అదే విధముగా మనలో సహజముగావుండిన ప్రేమఅనే మొక్కను తగిన శ్రద్ధ, సేవ అనే వాటితో అభివృద్ధిగావించుకోవచ్చు. పోషించుకోవచ్చు. ఈ సేవ ప్రేమ అనే మొక్కను అభివృద్ధిపరుస్తుంది. ప్రేమ చాలా పవిత్రమైనది. ప్రేమ అమృతస్వరూపము. అట్టి రసామృతమైన ప్రేమ గ్రోలిన మానవుడు మరే యితర పదార్థములు ఆశించడు. 'ప్రేమస్వరూపినం జీవనం'. ప్రేమ స్వరూపమే మనయొక్క జీవితము. జీవితమునకు ఆధారమైన యీ ప్రేమను మనము వేరు మార్గములో అనుభవిస్తున్నాము. ఇది కేవలము స్వార్థముగా రూపొందుతుంది. ఈ ప్రేమను సమాజములో పెంచాలి. ప్రేమను యితరులకు పంచాలి, ఇతరుల ప్రేమను నీవు అందుకోవాలి. ఈ విధముగా యిచ్చిపుచ్చుకొనే దానియందే యీ ప్రేమయొక్క బలము అభివృద్ధి అవుతుంది. దీనివల్ల సంకుచిత భావములు పోయి పవిత్రమైన, విశాలమైన భావములు మనలో ఆవిర్భవిస్తాయి. విశాలమైన జగత్తులో మనము విశాలమైన మానవునిగా రూపొందాలి.

## శరీరము ధర్మమును ఆచరించుటకు ఒక పనిముట్టువంటిది

ప్రతి మానవునకుకూడను నాలుగు విధములైన స్థానములున్నవి. ఒకటి శరీరము,

srisathyasaivachanamrutam

రెండవది మనసు, మూడవది బుద్ధి, నాల్గవది ఆత్మ. అయితే యీ శరీరముయొక్క పరిస్థితిగాని, శరీరముయొక్క పనిగాని, శరీరముయొక్క ధర్మముగాని యేమిటి? 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్'. శరీరము ధర్మమును ఆచరించే పనిముట్టు. అయితే యీ పనిముట్టు తన ధర్మమును యే రీతిగా ఆచరించగలదు? కత్తి ఒక ఫలమును కోస్తుంది, కూరగాయలు తరుగుతుంది. కానీ, కత్తి స్వయముగా యీ కూరగాయలను తరగటానికి పూనుకోదు. దానిని పట్టుకొనే ఒక వ్యక్తి వుండాలి. ఆ పట్టుకొన్న వ్యక్తి కూరగాయలు యేవిధముగా తరగాలి అనే యోచనతో తరుగుతూవుండాలి. అదే విధముగనే యీ శరీరము ఒక పనిముట్టువంటిది. ఈ పనిముట్టు స్వయముగా కర్మలలో ప్రవేశించటానికి వీలులేదు. దానికంత స్వాతంత్ర్యములేదు. ఇది మనసుయొక్క ప్రోత్సాహము చేతను, బలముచేతను పనిచేస్తూవుంటుంది. అన్నింటికిని మనసే ఆధారము. అందువలననే 'మనోమూలమిదంజగత్' అన్నారు. పాంచభౌతికమైన, యింద్రియములచేతకూడిన జగత్తు యీ మనసుపైననే ఆధారపడివుంటున్నాది. కనుక యీ మనసుయొక్క తత్త్వాన్ని మనము చక్కగా గుర్తించాలి. ఈనాడు మన ప్రవర్తనలన్నింటికిని దేహమునకు శిక్షనిస్తున్నాము. అది ధర్మవిరుద్ధము. ఏ విధముగా? ఒక చిన్న ఉదాహరణము. ఒక వ్యక్తి మరొక వ్యక్తిని చంపినాడు లేక హింసించాడు. ఆ వ్యక్తికి ధర్మశాసనమునందు ఉరిశిక్ష వేయబడింది. ఈ శిక్ష అనుభవించేది దేహము. కానీ, దోషము చేసినది మనసు. మనసు దోషముచేస్తే శరీరానికి శిక్షయేమిటి? మనసుయొక్క ప్రోత్సాహములేకుండా, ప్రోద్బలము లేకుండా శరీరము కర్మలు ఆచరించటానికి వీలుకాదుకదా! కానీ మనసును శిక్షించే అధికారి యీ జగత్తులోలేడు. అందువలననే యీ ధర్మశాసనమనేది శరీరాన్ని శిక్షిస్తున్నాది. ఇది ప్రాకృతమైన ధర్మము.

**ఇంద్రియములు కేవలము తన పని తాము చేస్తాయి; కాని, ఆనందాన్ని అనుభవించేది మనస్సు**

కాని, పరమాత్మ ధర్మమదికాదు. తప్పు చేసినది మనసు. కేవలము ఒక వుపాధిగా, ఒక విధముగా పనిముట్టుగా వినియోగపడేది దేహము. దేహము తన కర్తవ్యాన్ని తాను

sri sathyasai vahini vachanamrutam

అనుసరించిందేకాని దోషమంతా మనసుదని మనసును శిక్షిస్తాడు, భగవంతుడు. ఈనాడు దేహము యింద్రియములద్వారా అన్ని రకములైన ఆనందాన్ని అనుభవిస్తుంది. అలా అనుభవించటమే తనయొక్క పరిమితి. కానీ, ఆనందించేది మనసు. నాకు ఆకలౌతున్నాది. ఆకలైతే యీ ఆకలి తీర్చేది యే విధముగా? ఆకలి యెక్కడౌతున్నది? నా ఉదరములో ఆకలిగా వుంటున్నాది. ఆ జఠరాగ్నికి యేదో కొంచెము ఆహారమునందించినప్పుడే యీ ఆకలి తీరుతుంది. ఇది దేహముయొక్క స్వభావము. ఈ ఆకలిని తీర్చటానికి యేమి పని చెయ్యాలి? తట్టలోనుండిన పదార్థము తీసుకొని పొట్టలోకి చేర్చాలి. తీసుకున్నది హస్తము. నమిలినది పండ్లు. మింగినది గొంతు. చేరినది ఉదరము. కానీ ఆనందము, తృప్తిని అనుభవించినది మనసు. ఏతావాతా దీనియొక్క అంతరార్థము యేమనగా యింద్రియములు కేవలము తమ పనులు తాము చేస్తున్నాయేకాని ఆనందాన్ని అనుభవించేది మనసు. అయితే యీ మనసు యే రీతిగా ఆనందాన్ని అనుభవిస్తున్నాది? గ్రుడ్డివాని ఆనందాన్ని అనుభవిస్తున్నాది. ఏదో ఆకలి తీర్చుకుంది. బలహీనత తగ్గింది. ఆనందము హెచ్చింది. ఆకలిగా వుండినప్పుడు యేదైనా అందుకొని భుజిస్తుంది. ఈ లక్షణము వుండేది మనసుకు. కానీ బుద్ధి మరొకటి వేరేవుంది. అది మూడవది. అది విచక్షణాజ్ఞానము. ఏది తినాలి, యేది తినకూడదు; యేది తింటే మన ఆరోగ్యము బాగుపడుతుంది; ఏది విడిచిపెడితే మన ఆరోగ్యము బాగుపడదు, అనే విచక్షణ ఆ బుద్ధికి మాత్రమే వుంటుండాది.

**ఆత్మతో తాదాత్మమును పొందిన మానవుడు ఆనందాన్ని పొందుతున్నాడు**

ఈ విచక్షణాజ్ఞానము కల్గిన బుద్ధియొక్క ఆధారముచేత మనసు ప్రవర్తించినప్పుడు యీ మనసుయొక్క ప్రవర్తనను దేహము ఆనందముగా అనుభవిస్తుంది. ఏ పని చెయ్యాలని తలంచినప్పటికిని అక్కడ మనం నిత్యానిత్యవిషయ పరిశీలన సల్పాలి. ఇది మంచిదా చెడ్డదా, చేయతగినదా, చేయతగనిదా? ఈ విచారణశక్తి శూన్యమైపోతే మనసు గుడ్డిదిగా మారిపోతుంది. అయితే యీ శరీరమునకు, మనస్సుకు, బుద్ధికి ప్రాణాన్ని అందించి, దాన్ని పోషించి, దానిని కదలింపచేసేది యేది? అదే ఆత్మ. ఈ శరీరాన్ని తాదాత్మ్యభావనగా

sri sathyasai vahini

పొందుతున్న మానవుడు యింద్రియసుఖమును పొందుతున్నాడు. మనస్సును తాదాత్మ్యభావనగా చేసుకున్నవాడు భౌతికమగు సుఖభోగములను అనుభవిస్తున్నాడు. బుద్ధినే తాదాత్మ్యభావనగా చేసుకున్నవాడు విజ్ఞానమయుడుగా రూపొందుతున్నాడు. ఆత్మనే తాదాత్మ్యభావనగా విశ్వసించినవాడు ఆనందాన్ని పొందుతున్నాడు. ఇక్కడ మనము విచారణ చెయ్యాలి. భావములచేత రోగములు కలుగుతాయి. శరీర, యింద్రియములనుభవించేటి భోగములచేత మనకు రాగద్వేషములనే రోగములు కలుగుతున్నాయి. అయితే, విచక్షణాజ్ఞానముతో మనము వీటిని అనుభవించటముచేత విజ్ఞానము అభివృద్ధిఅవుతున్నాది. కానీ యీ విజ్ఞానాన్ని మనము అనందమయమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడు ఆత్మతత్త్వాన్ని పొందుతున్నాము. ఈనాడు మనకు భోగములు కావాలా? విజ్ఞానము కావాలా? ఆనందము కావాలా అని మనము నిర్ణయించుకోవాలి. ఆనందమును అనుసరించేవారు, ఆనందమును అభిలషించేవారు ఆత్మదృష్టితో పని చేయాలి.

**అందరియందు ఉండిన ఆత్మతత్త్వము ఒక్కటే!**

ఆత్మదృష్టితో మనము పనిచేసేటప్పుడు సమత్వము వస్తుంది. భిన్నత్వమనే ద్వైతము యిందులో యేమాత్రము ప్రవేశించదు. చూచేవానికి విశాలమైన ప్రపంచము. కానీ, యీ విశాలమైన ప్రపంచాన్ని సృష్టించినవాని దృష్టితో మనము చూచినప్పుడు ప్రపంచమే మనకు శూన్యము. కనుక, మనము అన్నింటికిని మూలాధారమైనదానిని పట్టుకోవాలి. ఈ మూలాధారమనేది వేదములవల్లగాని, యితిహాసములవల్లగాని, పురాణములవల్లగాని, ఉపనిషత్తులవల్లగాని, గీతవల్లగాని లభ్యమయ్యేదికాదు. ఇవన్నీ కేవలము బాహ్యప్రపంచమునకు ఆధారములు. ఈ బాహ్యప్రపంచము నిరంతరము ద్వైతమునే పురికొల్పుతున్నాది. నాది, నా వారు యింతమాత్రమే అయిన సంకుచిత భావాన్ని పెంచుతున్నాది. అన్నింటియందువుండిన యేకత్వాన్ని మనము గుర్తించినప్పుడు అదే నిజమైన అద్వైతముగా మారుతుంది. ఈ అద్వైతభావమును అలవరచుకోడానికి తగినవి సేవలే! అందరియందువుండిన ఆత్మతత్త్వము ఒక్కటే. ఒకని పేరు 'రామా' అని పెట్టవచ్చు.



sri sathyasai vahini vachanamrutam

ఒకనిని 'మధుసూదన' అని పిలువవచ్చు. కానీ, యివి పెట్టినపేర్లేగాని, ఆత్మస్వరూపమైనవికాదు. పుట్టిన దేహమునకు పెట్టినపేర్లు. కాని పుట్టని, గిట్టని, తత్త్వము ఒకటుంది. దాని పేరే 'నేను'. నిజముగా భగవంతుని పేరు 'రాముడు', 'కృష్ణుడు', 'సాయి' కాదు. అవి దేహానికి పెట్టినపేర్లు. నిజముగా భగవంతుని పేరు 'అహం' అనగా 'నేను', 'నేను', 'నేను'. ఆ 'నేను' అనే పేరు అందరికి వుంటుండాది. మీ అందరిలోపలకూడను ఫలాని రాముడు యెవరంటే 'నేను' అని చేయి ఎత్తుతాడు ఒకడు. ఫలాని కృష్ణుడు ఎవరంటే వాడు చేయి ఎత్తుతాడు. ఈ విధంగా ప్రతి ఒక్కరూ 'నేను', 'నేను' అంటున్నారు. అయితే రామునియొక్క రూపనామములు వేరు, కృష్ణునియొక్క రూపనామములు వేరు. కాని, అందరియందు 'నేను', 'నేను' అనేది సమానంగా ఉంటున్నది. కనుక 'I' is everywhere. 'నేను' నేనుగానే వున్నాను. ఈనాడు యిలాంటి అద్వైతబోధలు చేసే వ్యక్తులు లేకపోవటంచేత జీవితమంతయు ద్వైతములోవుండి విశిష్టాద్వైతమువరకు పోవటంలేదు. ఈ విధమైన సాధనలు మనము యెంతకాలము చేసినప్పటికిని సరైన స్థితిని పొందలేము, అనుభవించలేము. కనుక, ప్రతిమానవుడుకూడను అద్వైతభావమును లక్ష్యమునందుంచుకొని ద్వైతభావముతో సమాజములో ప్రవేశించి సేవలే ఆరాధన అనే సత్యమును గుర్తించాలి. 'మనము దాసులము' అనే దానిలో దైవత్వము వుంటున్నాదిగాని 'నేను యజమానుడు' అని అనిపించుకునే దానిలో దైవత్వములేదు. ఈవిధమైన అహంభావముతోకూడినది వికృతాన్ని పొందుతుంది. ఆత్మభావముతోకూడినది సుకృతాన్ని అందుకుంటుంది. మనము యెక్కడనుండి బయలుదేరివచ్చాము? సాధననుండి బయలుదేరివచ్చాము. సేవకులుగా చేరాము. దాసులుగా మారాలి. ఈ దాసత్వమునుండి దైవత్వము పొందాలి. కనుక, ప్రాచీన ఋషులందరు దాసత్వాన్ని మొదలు అందుకొని దైవత్వాన్ని అనందముగా పొందినారు. అహంకారము మొట్టమొదట నిర్మూలము కావాలంటే దాసులు కావాలి. కనుకనే గోపన్నకూడను ఒకనాడు చెప్పాడు

**దాసానుదాసుడను కావలెనురా**
**నేను యీ దాసులకు సేవ చేయవలెరా ॥దా॥**
**ఆలుబిడ్డలుకూడి వేళవేళలయందు**

నేనొక్కడినేకాదు. నా భార్యబిడ్డలు అందరు దాసానుదాసులై పోవాలి. అప్పుడే మనము భవబంధమునుండి దూరముకావచ్చు. ఇదే భక్తి మార్గము.

**భక్తి అమృతస్వరూపము**

శంకరులవారు అద్వైతమతాన్ని చాటుతూవచ్చారు. 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' అని వుచ్చరించాడు. పదములైతే వుచ్చరించవచ్చునేగాని దీని తత్త్వాన్ని అనుభవించటము మహాకష్టము. శివానందలహరిలో పూర్తి అద్వైతాన్ని నిరూపించాడు. అలాగే సౌందర్యలహరిలోకూడా పక్కా అద్వైతమును బోధించాడు. అయితే, ఇన్ని విధాల అద్వైతాన్ని బోధించి, లిఖించి దేశానికి అందించిన శంకరులు కట్టకడపటికి యేమన్నాడు? 'భజగోవిందం భజగోవిందం గోవిందంభజ మూఢమతే' అని భక్తిలోకి దిగిపోయాడు. లిఖించినది, బోధించినది అద్వైతము. ఆచరించినది, అనుభవించినది, భక్తి. భక్తి అనగా పరమపూజ్యమైనది, అతి మృదువైనది, అతి మధురమైనది, ఆనందమయమైనది మరియు ఆహ్లాదమయమైనది. అట్టి భక్తిని మనము యీనాడు అభివృద్ధి పరచుకోవాలి. భక్తి అమృతస్వరూపము. అదే అనంతత్వము. అదే అమరత్వము. దీనినే నారదుడు బోధించినది. ప్రేమమయమైన హృదయాన్ని త్యాగమయముగా మార్చుకొని యీయొక్క యోగమయములో మనము చేరిపోవాలి.

**వదలవలసిన దానిని వదలినంత**
**తెలియవలసిన దానిని తెలిసినంత**
**చేరవలసిన దానిని చేరినంత**
**కలుగు ఆనందమింతని చెప్పతరమా**

వదలవలసినవి, యీ జగద్భావములను. తెలియవలసినది, యీ జీవతత్త్వములు, చేరవలసినది, ఆ పరబ్రహ్మతత్త్వము. అట్టివాడే అమృతత్వుడు. దీనినే

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

sri sathyasai vachanamrutam

అన్నారు. జగత్తుయొక్క తత్త్వాన్ని మనం చక్కగా గుర్తించుకుంటే యింక మనకే చింత లేదు. ఇవన్నీకూడను సినిమా పిక్చర్సు మాదిరి వచ్చిపోయేవేగాని, శాశ్వతమైనది ఒక్కటీలేదు. అంతా passing clouds, passing clouds. వచ్చింది సత్యమనుకుంటున్నాము. సత్యమనుకుంటుండగనే పోతున్నది. పోయేటప్పటికి అసత్యమనుకుంటున్నాము. వచ్చేటప్పుడు సత్యమను కుంటున్నాము. ఈ రెండింటిని చూస్తే వచ్చిపోయేవి సత్యాసత్యములు. మిథ్యగా మారిపోయింది. మిథ్య అనగా శాశ్వతముగానిది. యీ సత్యాన్ని మనము గుర్తించుకుంటే యిదే నిజమైన లోకసంబంధము.

**ఆత్మతత్త్వముచేతనే సమస్త జీవులు, సమస్త ఇంద్రియములు, తమ తమ పనులను తాము చేస్తూ వున్నాయి**

జీవుడు యెవరు? ఈ జీవత్వము యెక్కడనుండివచ్చింది? దీనికి దైవమే మూలకారణము. మనము ఒకచోట యినుపముక్కలు కుప్పపెట్టాము. మరొకచోట వెండిముక్కలు కుప్పపెట్టాము. మరొకచోట రాగిముక్కలు కుప్పపెట్టాము. మరొకచోట డైమండ్స్ అంతా తెచ్చిపెట్టుకున్నాము. ఇంకొకచోట బంగారు కుప్పపెట్టాము. వీటిమధ్య అయస్కాంతము పెట్టేటప్పటికి అది బంగారువిలువను చూడదు. వెండివిలువ అదిచూడదు. ఏ విలువలేని యినుమునుమాత్రమే అది లాగుతుంది. అయితే, చైతన్యములేని యినుపముక్కలు కదలి ఈ అయస్కాంతము దగ్గరకు రావటానికి యేమి కారణము? యెక్కడనుండి వచ్చింది, యీ చైతన్యము? యీ యినుపముక్కలకు కాళ్లులేవే! యీ యినుప ముక్కలకు రెక్కలులేవే! వీటిని తాడు పట్టి లాగలేదే! ఆకర్షించింది అయస్కాంతము. ఆ అయస్కాంతము ప్రక్కనుంటే జడమైన ఇనుపముక్కనుకూడా కదలిస్తుంది. ఆ magnet యే ఆత్మతత్త్వము. ఈ ఆత్మతత్త్వముచేతనే సమస్త జీవులు, సమస్త యింద్రియములు, సమస్త ప్రాణులుకూడను తమ తమ పనులను తాము చేస్తూవున్నాయి. కనుక యిట్టి ఆత్మతత్త్వాన్ని తెలుసుకోటానికి మనము ప్రయత్నము చెయ్యాలి.

**అనాత్మను తొలగించుకుంటే ఆత్మ ఆత్మగానే గోచరిస్తుంది**

అయితే, యీ ఆత్మతత్త్వమును తెలుసుకోటానికి యేమి మార్గము? ఉన్నదంతా ఆత్మనే!

srisathyasaivachanamrutam

ఎక్కడచూచినా ఆత్మనే! నిండి నిబిడీకృతమైనది ఆత్మనే! ప్రతి పదార్థము ఆత్మనే! ప్రతి విషయము ఆత్మనే! ప్రతివ్యక్తి ఆత్మనే! దీనినింక తెలుసుకోటం యేమిటి? అయితే అనాత్మ అనేది మనము కల్పించుకోటంచేత యీ ఆత్మను మనము సరాసరి చూడలేకపోతున్నాము. అనాత్మను తొలగించుకుంటే ఆత్మ అదిగానే మారిపోతుంది. నవవిధభక్తిమార్గములైన

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

ఆత్మ దర్శనంకోసము కాదు. ఆత్మను మనము దర్శించటానికి యేమాత్రము ఆశించనక్కరలేదు. అనాత్మను తొలగించుకుంటే చాలు. అనాత్మను తొలగించుకొనే నిమిత్తమై యీ సాధనలు చేస్తున్నామేగాని ఆత్మను మనము క్రొత్తగా దర్శనం చేయటంకోసము కాదు. ఈ సత్యాన్ని మనము మొట్టమొదట మనలో చక్కగా ఫౌండేషన్ వేసుకోవాలి. ఆ నిత్యసత్యమైన పునాదులు మనము భద్రముగా వేసుకున్నప్పుడే సేవలయందుగానీ, సాధనలయందుగానీ దిగ్విజయాన్ని పొందుతాము. ఎప్పుడు చూచినా సందేహాల పుట్టగా మనము మారుతూవుంటే యీ సాధనలో మనము విజయాన్ని యేరీతిగా సాధిస్తాము? చిన్న చిన్న విషయములయందే మన మనస్సు చాలా అలజడిపొందుతున్నాది. యింక ఆత్మానందమనేదానిని అనుభవించటానికి యేమాత్రము శక్తిసామర్థ్యములుండవు. ఈ భ్రాంతులంతా అతికించుకున్న ముక్కులు. ఒక్కతూరి దగ్గుతూనే యీ ముక్కు వూడిపోతుంది. యింక తుమ్మితే వుంటుందా? గజం దూరం యెగిరిపోతుంది. ఇలాంటి అనిత్యము, అశాశ్వతముయైన తలంపులచేత నిత్యసత్యమైన ఆత్మానందమును మనము యేనాడుకూడను అందుకోలేము. కనుక మొట్టమొదట ప్రతి వ్యక్తికూడను, ప్రతి సేవకుడుకూడను 'ఆత్మయే నాకు ఆధారము, నేను ఆత్మస్వరూపుణ్ణి' అనే భావాన్ని అభివృద్ధిపరచుకోవాలి. 'నాలోవున్న ఆత్మయే అందరియందువుంది. అందరియందువున్న ఆత్మయే నాలోను వుంటున్నది. కనుక ఎవరికి యే బాధకల్గినా అది నాదే', అనే భావాన్ని మనము అభివృద్ధిపరచుకున్నప్పుడే మనము ఆనందముగా సేవ చేయగలము. ఇతరులను ఆనందింపచేయగలము. కేవలము వేసుకున్న వేషాలైన యీ దేహభావములను పట్టుకొని

srisathyasaivachanamrutam

అనవసరముగా వాదోపవాదములు వేయటము యిది సరైన మార్గము కాదు.

**పని చేయని మానవుని దేహము తుప్పుపట్టిన మిషనువంటిది**

కనుక, మొట్టమొదట ప్రతి ఒక్కరుకూడను 'నేను ఆఫీస్ బేరర్, నేను స్టేట్ ప్రెసిడెంటు, నేను జిల్లా ప్రెసిడెంటు, నేను ప్రపంచమునకే ప్రెసిడెంటు' ఇలాంటి భావములు యేమాత్రము పెట్టుకొనరాదు. ఎవరి స్థాయికి తగిన సేవ వారు చెయ్యాలి. ప్రతి వ్యక్తికూడను తనకుతాను పరీక్షించుకోవాలి. 'నేను స్టేటు ప్రెసిడెంటుగా వుంటున్నాను. ఆ స్టేటు ప్రెసిడెంటుపదవికి తగిన పనిని నేను చేస్తున్నానా, లేదా?' అని తనకు తాను ప్రశ్నించుకోవాలి. అప్పుడు తనకు తానే తృప్తిపడతాడు. అదే self satisfaction. యీనాడు యెవ్వరికిని self satisfaction లేదు. కారణమేమిటి? తన తృప్తికొరకు తాను చేయటంలేదు. కనుక ఆ self satisfaction లేకపోతున్నది. కనుక, యీ ఆత్మతృప్తిని పొందాలనుకున్నప్పుడు ప్రతి ఒక్కరు తాను మొట్టమొదట సేవకుడనని భావించాలి. మన మాటలతో ఉపన్యాసములతో, యితర విధములైన ఆడంబరములతో మనము మానవత్వాన్ని పోగొట్టుకుంటున్నాము. నూరు చెప్పేదానికంటే ఒక్కటి చేసిచూపిద్దాము. ఆ విధమైన సమభావము, శాంతిభావము, ప్రేమభావము మనలో ఆవిర్భవించాలంటే 'మనము అందరూ సేవకులమే, అందరూ వర్కర్సే', అనే భావము పెంచుకోవాలి. ఒక మిషను వుంటుండాది. ఒక పంపు సెట్టు వుంటుంది. ఒక జెనరేటరు వుంటుంటుంది. అది యినుముతో తయారైనది. ఆ యినుముతో తయారైన జనరేటరుగానీ, పంపుసెట్టుగానీ పనిచేయకపోతే తుప్పు పడుతుంది. ఈ దేహముకూడను ఒక జెనరేటరు వంటిది. ఒక పంపుసెట్టు వంటిది. అది యినుపమయమైనది. ఇది మాంసమయము. ఇనుముకే తుప్పు పట్టుతుంటే దేహము పనిచేయకపోతే తుప్పుపట్టదా? రెండు దినాలు స్నానము చేయకపోతే అప్పుడే తుప్పు పట్టుతుంది. వాంతులు ప్రారంభమౌతాయి. కనుక, పని చేయని మానవుని దేహము తుప్పు పట్టిన మిషనువంటిది.

**పనిని మార్చుకోవడమే విశ్రాంతి**

కనుక, మనము పని చెయ్యాలి. అయితే యీ పని యెంతవరకు చేయాలి అనే

దానికికూడను ఒక హద్దు వుంది. మితిమీరి పనిచేస్తే, దానికి అందించవలసిన ఆహారపానీయాదులు అందించకుండాపోతే యీ మిషను కొంతవరకు చెడిపోతుంది. అనారోగ్యాన్ని పొందుతుంది. ఆరోగ్యము చెడకుండావుండేంత పని మనము చెయ్యాలి. దీనికి విశ్రాంతి వుండాలి. మిషన్ చూడండి. ఒక బస్‌గాని, కారుగాని, యీ ఫ్యాక్టరీస్‌కంతాకూడను sunday holiday యివ్వటానికంతా కారణం యేమిటి? వారానికి ఒకతూరి ఆ జడమైన యినుప మిషనులకు రెస్టు యిస్తున్నారు. ఈ చైతన్యమైన దేహానికి రెస్టు అవసరంలేదా? కనుక, దీనికి యివ్వవలసిన సమయములో రెస్టు యివ్వాలి. ప్రేమస్వరూపులారా! రెస్టు అంటే మంచి డన్‌లప్ బెడ్డు వేసుకొని, పిల్లోవేసుకొని, ఎయిర్‌కండిషన్ వేసుకొని గురకలు తీస్తూ పండుకోటం కాదు. Change of work is rest. పనులను మనం మార్చాలి. మనం బజారునకు పోయి పని చేశాము. అక్కడ పని చేసి వచ్చామని చెప్పి భార్యతో అరచి, రెండు బెడ్సు వేసుకొని, బోల్టు వేసుకొని పండుకొనటం కాదక్కడ. ఆ పనిని వదలి యింటికి వచ్చిన తరువాత నీ యింటిపని చేయి. అది నీకు రెస్టు. విద్యార్థులే వుంటుంటారు. కొంత సేపు ఆటలాడుతారు. ఆటలాడగానే రెస్టు వుండకూడదు. తిరిగి పాటలు పాడుకోవాలి. అదే రెస్టు. ఈ ఆటలైన తరువాత పాటలవీ అభివృద్ధిపరచుకోవాలి. ఇవన్నీ అయినతరువాత పుస్తకము పట్టుకొని చదువుకోవాలి. ఈ విధముగా మనము పనిని మార్చుకుంటూపోవాలి. ఎప్పుడు చూసినాకూడను యీ దేహము పని జరుపుతూనే వుంటుంది. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములు చూడండి. అయ్యో! అతను పాపం దుఃఖములో వున్నాడే కొంచెం రెస్టు యిద్దామని అదేమన్నా ఆగుతున్నదా? ఆగదు. అతను ఆనందముగా వుంటున్నాడు కాబట్టి మనము యిష్టం వచ్చినట్లు తిరగవచ్చని చెప్పి యేమైనా తాను అధికమైన శ్వాసను తీస్తుందా? లేదు. నీవు దుఃఖములోవుండు, విచారములోవుండు, నడుస్తూవుండు, కూర్చునుండు, ఆడుతూవుండు, పాడుతూవుండు; యేమిచేసినప్పటికి ఆ ఉచ్ఛ్వాసనిశ్వాసములు సక్రమంగా జరుగుతూనే వుంటున్నాయి. ఇది సహజ లక్షణము. ఇది దైవముయొక్క సృష్టిరహస్యము. ఈ రహస్యాన్ని యెవరుకూడను గుర్తించుకోటంలేదు. ఇట్టి దైవరహస్యాన్ని అతి సూక్ష్మమైన మార్గంలో మనము తెల్సుకోటానికి సేవయే సరియైన సాధనము. కనుక ప్రతి ఆఫీసు బేరరు ఒక సేవకుడను

srisathyasaivahini.org

ముందుగా తాను గుర్తించాలి.

## సేవయందే దివ్యత్వాన్ని పొందాలి

దివ్యాత్మస్వరూపులారా! 'ఈ విధమైన నిబంధనలకు మేము తట్టుకోలేము' అనే భావముచేత మీరు సంస్థను విడిచి పోకూడదు. ఇంతకంటే పవిత్రమైన మార్గము జగత్తులో కన్పించదు. ఈ సదవకాశాన్ని మీరు వదలుకోకూడదు. మీ జన్మమును తరింపచేసుకోటానికి సరియైన మార్గము యిదే అనే సత్యాన్ని మీరు విశ్వసించాలి. అన్నీ వదలిపెట్టి ముక్కు మూసుకొని, డొక్కలు కొట్టుకుంటూ జపంచేస్తే ప్రయోజనములేదు. లేక దేవాలయములు తిరిగి యాత్రలంతా గావిస్తే ప్రయోజనంలేదు. మీరు సేవయందే దైవత్వాన్ని పొందాలి. అదే విశ్వవిరాట్ స్వరూపము. అర్జునుడు మాత్రమే విశ్వవిరాట్ స్వరూపము చూశాడు. కానీ, మీరందరు అర్జునులే! అర్జునునకు 'పార్థ' అని ఒక పేరు. పార్థ అంటే పృథ్వీపుత్రుడు. మీరందరు పృథ్వీపుత్రులే! మీరందరు పార్థులే! ఈ పార్థుడు పారిపోటానికి యేమాత్రము ముందంజ వేయకూడదు. అర్జునుడే యుద్ధమునుండి పారిపోయివచ్చేస్తే అతనికి గౌరవమర్యాదలు యేముంటాయి? కర్తవ్యాన్ని నిర్వర్తించమని శాసించాడు, కృష్ణుడు. Do your duty sincerely. మీ పనులు మీరు చేస్తూ భగవన్నామాన్ని స్మరించండి. అప్పుడు మీరు అర్జునరూపాన్ని ధరించినవారౌతారు. అర్జునుడు అనగా అర్థమేమిటి? పెద్దగాండీవాన్ని పట్టుకొని, చిక్కినవారినందరిని కొట్టుకొని పోవటంకాదు. 'అర్జున' అనగా నిర్మలత్వము, పవిత్రము అని. అర్జునుడనగా చాలా పరిశుద్ధమైన హృదయము కలవాడని అర్థము. కనుక యీ అర్జునులకంతా మాలిన్యమైన హృదయము ఉండకూడదు. పరిశుద్ధమైన హృదయముతో మీరు పనిచేయాలి. మీరందరూ అర్జునులే! అర్జునుని నిమిత్తమాత్రంగా పెట్టుకొని కృష్ణుడు యింత నాటకమాడాడు. అదేవిధంగా యీనాడు యీ సాయికృష్ణుడు యింతమంది అర్జునులను పెట్టుకొని నిమిత్తమాత్రంగా ఆడుతున్నాడు. 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచి', అన్నట్లుగా మిమ్మల్ని నిమిత్తమాత్రంగా పెట్టుకుని నేనే యీ పనులు చేస్తున్నాను. నేనే యీ సేవలు చేస్తున్నాను. 'సాయి ఆర్గనైజేషన్‌కంతా యింత పేరు తెప్పించాను. అంతపేరు తెప్పించాను' అని, ఈ అహంకారానికి మీరు ఏ మాత్రం

sri sathyasai vachanamrutam

అవకాశము అందించకూడదు. సాయి ఆర్గనైజేషన్‌వల్ల నీ పేరు, నీ రూపము, నీయొక్క తత్వము జగత్‌వ్యాప్తి అవుతుందిగాని సాయి లేకపోతే నీ రూపమెక్కడ, నీ పేరెక్కడ?

**సాయినామమే మీ పేరు ప్రతిష్ఠలను అభివృద్ధిపరుస్తుంది**

మీ పేరు ప్రతిష్టలంతా అభివృద్ధిపరచేది సాయినామమే. దీనిని మరువరాదు. దైవచింతనే శ్వాసగా భావించాలి. కనుకనే 60వ సంవత్సరమునుండికూడను యీ ఆధ్యాత్మిక తత్త్వమనేది కేవలము అద్వైత మార్గములో నడిపించటానికి నేను సంకల్పించాను. కర్మకాండ దాటినాము. ఉపాసనాకాండను దాటినాము. జ్ఞానములో ప్రవేశించాలి. ప్రైమరీస్కూలు దాటినాము. హయ్యర్ సెకండరీస్కూలు దాటినాము. ఇక కాలేజీలో ప్రవేశించాలి. కాలేజీలో వుంటుండికూడను ప్రైమరీస్కూల్లో చదివినట్లు A,B,C..... డింగ్‌డాంగ్ బెల్ అంటూ కూర్చుంటే ప్రయోజనములేదు. ఈనాడు మీరు అదే స్థితిలో వుంటున్నారు. కాలేజీలెవెల్లోనికి వచ్చినారు. కానీ, మీ చింతనంతా ప్రైమరీస్కూలుపైననే వుంటున్నాది. అంత అమాయకత్వంగా మారిపోతున్నాది, మీ తత్త్వము. కనుక, యీనాటినుండి యితరులు ఎవరూకూడను సాధించలేని అద్వైతమతాన్ని సాయీభక్తులు సాధించాలి. అందుకొరకే యీనాడు యీ సమావేశములోపల కొన్ని మార్పులు, కూర్పులు చేయవలసివచ్చింది. వ్యక్తులనుబట్టి కాదిది. మీ దోషములనుబట్టి కాదిది. ప్రపంచములోని పరిస్థితులనుబట్టి మార్చవలసివచ్చింది. యీనాడు ప్రపంచము సహస్రనేత్రములతో మిమ్మల్ని చూస్తోంది. 'ఏమిటిరా ఈ సాయి, సాయి? ఏ బజారుకుపోయినా, ఏ వూరుపోయినా, ఏ అడవికిపోయినా, ఏ గుడిసెకు పోయినా ఎక్కడ చూచినా సాయి ఫొటోలు, ఎక్కడ చూచినా సాయి మాటలు; ఇదేమిట'ని అనేకమంది అశ్చర్యముగాను, అసూయగాను, ఇంకా అనేక విధములైన భావములతో పరీక్షించటానికి ప్రయత్నిస్తున్నారు. అలాంటి సమయములోపల మనలో కించిత్తైనా యితరులు వేలుపెట్టి చూపేంత భావాలుగాని, పనులుకాని వుండరాదు. ఎవరిస్థానానికి తగినట్లు వారియొక్క పనులు వారు సక్రమంగా చేసుకుంటూపోవాలి. ప్రారంభములో యీ Rules and Regulations అత్యవసరము. ఇప్పుడందరుకూడను అర్థం చేసుకున్నారు కాబట్టి వాటిని మార్చుకునే శక్తి,

sri sathyasai vachanamrutam

సామర్థ్యములుకూడను వారిలో వుంటాయి. కనుకనే యికపైన ఒకరు అధిపతి, ఒకరు వర్కరు యీ విధమైన భేదములేకుండా అందరూ బ్రదర్సు యీ రకమైన దానిలో మనము వుండాలి. ఈ విధమైన ప్రేమభావాన్ని మనం పెంచాలి. అనేకత్వములోని యేకత్వమును మనం జగత్తుకు నిరూపించాలి. అయితే యింకా అంతటిస్థాయికి అందరూ రాలేదు. కనుక, యీనాడు స్టేట్‌ప్రెసిడెంటు అనేవాడు ఒకడు వుండాలి. ఒక్కడే వుంటుంటే కొన్ని సమయాలలోపల మానవస్వభావం పిచ్చికోతివంటిది. యిలాంటి కోతికి యేమైనా అహంకారము పుట్టవచ్చును. అందువల్ల యీ అహంకారాన్ని చంపే నిమిత్తమై అతనిక్రింద ఐదారుమందిని పెట్టేసి, అందరిని సమానమైన పనిలో పెట్టేసినప్పుడు నేను ప్రెసిడెంటు అనే అహంకారానికి అవకాశమువుండదు. అందరు కలసిమెలసి పని చేద్దాము. 'కలసిమెలసి తిరుగుదాం. కలసిమెలసి పెరుగుదాం'. ఒకరితోఒకరు కలసిమెలసి పనిచేసే నిమిత్తమై ఒక్కొక్క రాష్ట్రానికి ఒక కమిటీ మాదిరిగా పెట్టి వారందరు ఆ పనులను పంచుకొని సమంగా సరైన మార్గములో సల్పటానికి అవకాశము వుంటుంది.

**ఎవరేమి చెపుతే ఆవిధంగా మనము పోరాదు**

State President ఒకడుంటుండి ఐదారుమంది కలసి ఒక కమిటీగా వుండినట్లు అయితే, యిది నా మంచికోసమనే భావము యేర్పడాలిగాని, నన్ను తీసేసి నా క్రింద యింకా పదిమందిని పెట్టారే అనే దుర్భావాన్ని మటుకు మనం తలంచరాదు. District Presidents తీసేశాము. కొన్ని districts లోపల సరిగ్గా జరగటంలేదు. పాపం ఆ District Presidents కొంతవరకు శల్యసారధ్యంకూడా ఉండవచ్చు. అంటే కర్ణునికివలె 'నీవు చేయటానికి వీలుకాదు, నీవు చేయలేవు, నీ చేతకాదు' అని బలహీనత తెప్పించే రథసారథులు కొందరుంటారు. దానినే శల్యసారధ్యమంటారు. యిటువంటివారిని మటుకు తీసేశాము. కృష్ణసారథిగా వున్నవారినిమాత్రం పెట్టాము. అర్జునుడు బలహీనుడైనా, భయపడి వెనుకకువచ్చినా, 'ఛీ! ఛీ! వెనుకకు పోకూడదు, పోముందుకు, పో! పో!' అని ప్రోత్సహించేవాడు, కృష్ణుడు. 'నీవు చేయి పని, మేమంతా వెనుక వుంటాము. మేము చూసుకుంటాము' అని ధైర్యసాహసములందించేవాడే, కృష్ణసారథి. అనగా

ధైర్యసాహసాలను, ఉత్సాహప్రోత్సాహములందించే సారధ్యముతో మనం వుంటుండాలి. 'ఇది మనకెందుకులే, యిది మనం చేయలేమేమో, మనచేతిలో డబ్బులేదే', యిలాంటి బలహీనతలందించే పిరికిపందలను యీ సంస్థనుండి పూర్తిగా తీసివేయాలి. మానవుడు చేయలేనిది ఒకటుందా? తనపని అయితే తాను యెంతవరకునైనా చేస్తాడు, రాత్రింబవళ్లు పనిచేస్తాడు. ఆ శ్రద్ధాభక్తులు యీ సేవలో మనమెందుకు వుపయోగించకూడదు? ఇలాంటి స్వార్థపరులను, సంకుచితబుద్ధి కలవారిని సంస్థలో యేమాత్రం పెట్టకూడదు. సంస్థ చెడిపోతుంది. 'ఇది నాది' అనే భావముతో వచ్చి చేరినవాడే యిందులో వుత్తీర్ణుడౌతాడు. అయితే కొన్ని జిల్లాలలో జిల్లా ప్రెసిడెంట్లు చాలా బాగా పని చేస్తున్నారు. రెండూ మనం చెప్పుకోవలసినదే! తన స్వంతపనులుకూడను మానివేసి యీ పనులలో ప్రవేశించి కాలాన్ని సార్థకంగావించుకుంటున్నారు. తమ ఆరోగ్యము యేవిధముగా పోయినప్పటికిని యిందులో స్వామియొక్క సేవగా భావించుకొని పని చేస్తున్నారు. అలాంటి District Presidents ను ఒకొక్కరిని తీసుకొని రెండుమూడు జిల్లాలకంతా వారిని పెట్టుకొని యీ సేవలు చేయవచ్చు. ఎవరెట్లు చెబితే అట్లంతా మనము పోరాదు. ఆ విధంగాపోతే మనము భ్రష్టులమైపోతాము. ఒక చిన్న కథ.

ఒకతాత, మనుమడు ఒక గాడిదను తీసుకొని యేదో సామానుతెచ్చుకోటంకోసం మరొక వూరు పోతున్నారు. తాత ముసలివాడు. మనుమడు చిన్న పిల్లవాడు. అతనికి సహాయార్థమై మనుమని తీసుకుపోతున్నాడు. ఎవడో పరిచయమైనవాడు యెదురువచ్చాడు. 'ఏమిటండీ, మీరిద్దరు యింత బుద్ధి తక్కువపని చేసుకొనిపోతున్నారు? ఇద్దరుకూడ నడచటం యేమిటి? ప్రక్కన గాడిద వుంటుంటే దానిపైకూర్చొని పోవచ్చుకదా!' అన్నాడు. అప్పుడు ముసలివాడు ఆయన చెప్పినది నిజమే అనుకొని తాను యెక్కాడు, ఆ గాడిదపైన. మరికొంచెం దూరం పోయేటప్పటికి యింకో పరిచయమైన వ్యక్తి ఎదురై 'ఏమిటండి! మీరు యింతపెద్దవారైవుండి చిన్నపిల్ల వానిని నడిపిస్తున్నారు? అతన్ని యెక్కించకూడదా?' అన్నాడు. అప్పటికి అది నిజముగానే, సత్యముగానే తోచింది. తాను దిగాడు. పిల్లవానిని యెక్కించాడు. మరికొంచెము దూరము పోయినారు. 'ఒకరు నడచటమేమిటి? ఒకరు కూర్చోటమేమిటి? యిది గాడిద, యిద్దరూ కూర్చుంటే యిది

sri sathyasai vahini

మోస్తుంది కదా!' అన్నాడు మరొక వ్యక్తి. ఇది నిజమే కదా అని యిద్దరూ ఎక్కారు. దాని నడుము వంగింది, బరువుయెక్కువైంది. మరెవరో ఒకరు యెదురువచ్చి. 'ఏమిటండీ! అది నోరులేని జీవి. ఇంత భారము వేసుకుంటే అది యేమైపోవాలి? చచ్చిపోతుందికదా! యిది బుద్ధితక్కువ' అన్నారు. ఇద్దరూ దిగారు. ఆ గాడిదకు నడచటానికికూడా శక్తి లేకపోయింది. మరి యింకొకడు వచ్చాడు. 'ఈ గాడిదను నేను యెట్లా తీసుకుపోయేది? ముసలివాడను', అని చెప్పేటప్పటికి 'అబ్బే నేను కఱ్ఱ యిస్తాను రెండు కాళ్లు కట్టేసి దానికి మధ్యలో యీ కఱ్ఱను పెట్టి యిద్దరూ మోసుకుపొండి' అన్నాడు. వీరిద్దరు చేరి ఆ గాడిదను మోసుకుపోతున్నారు చాలా కష్టముగా. ఒక పల్లె దగ్గరకు వచ్చేటప్పటికి ఆ పల్లె పిల్లలంతా నవ్వారు. గలాటా చేశారు. ఈ గలాటాకు గాడిద బెదరుకుంది. అది యిటూ అటూ తిప్పేసి ఒక వంతెనమీద పోతుంటే బాగా అల్లాడించేటప్పటికి తాత, మనుమడు యిద్దరూ నదిలో పడిపోయారు.

**నీ మాష్టరుయొక్క ఆజ్ఞను నీవు అనుసరించు**

ఈ విధముగా యెవరు యెట్లా చెబుతారో అట్లా మనము పోతుంటే నదిపాలైపోతాము. మనయొక్క హృదయాన్ని మనము అనుసరించాలి. నీ మాష్టరుయొక్క ఆజ్ఞను నీవు అనుసరించు. నీ హృదయ సంపర్కమును నీవు అనుభవించాలి. చెప్పుడు మాటలంతా వినటానికి నీవంత అమాయకుడుగా వుండకూడదు. ఒక మాటపైన, ఒక బాటపైన ఉండాలి. ప్రెసిడెంటుగా వుండినవారు ఒకొక్క జిల్లాలో ఒకొక్క చిన్న చిన్న కమిటీ పెట్టుకొని పని చెయ్యాలి. మన సంస్థాగతమైన ఆకారాన్ని తగ్గించి, కుదించి ముచ్చటగా మూడుగా మార్చుకున్నాము. ఒకటి సేవలయొక్క విభాగము, రెండవది ఆధ్యాత్మిక విభాగము, మూడవది విద్యా విభాగము. ఈ మూడింటికి పూర్వము చెప్పాను. దైవప్రీతి యిది చాలా అవసరము. రెండవది పాపభీతి. ఈనాడు మనము morality అని పెద్దగా అరుస్తున్నాము. ఈ moralityకి ఏమిటి ఆధారము? కావలిసినన్ని పుస్తకాలు చదివి, తల భారమైన డిగ్రీలు తీసుకొని, morality లేని వ్యక్తులు యెంతమందిలేరు, లోకములో? ఇది చదువువల్ల వచ్చేదికాదు. దైవప్రీతి వుండినవానికే పాపభీతి కలుగుతుంది. ఈ రెండు చేరినవానికే నీతి



srisathyasaivachanamrutam

వస్తుంది. అదే morality. దైవప్రీతియే లేకపోతే వాడు కేవలము మూర్ఖుడుగాను, పశువుగాను మారిపోతాడు. మానవత్వాన్నే కోల్పోతాడు. చాలామంది మీకు తెలుసు. పేపర్లో నిత్యము చూస్తూవుంటారు. హైజాకర్సు, కిడ్నాపర్స్ అని, లూటీ చేసేవారని, గజదొంగలని యెన్నో మనము వింటున్నాము. వీరందరి చదువులు, ఉద్యోగాలు చూస్తుంటే గొప్ప గొప్ప యింజినీర్లు, డాక్టర్లు, మేధావులే! ఈ చదువుల్లో వీళ్లకు మానవత్వమెక్కడ అబ్బింది? కాబట్టి, మానవత్వమనేది చదువులతో వచ్చేదికాదు. సంస్కారముతో లభించేది. కనుక, మనము కేవలము Human values అని యీ గవర్నమెంటు టీచర్సును, పిల్లలను పెట్టుకొని యీ అవస్థలు పడటంకంటే మన సంస్థలో వుండినవారందరికి యీ మానవత్వమనే దానిని చక్కగా అభివృద్ధిగావిస్తే లోకమంతా చక్కబడుతుంది. మొదట, సాయి సంస్థలో వుండిన ప్రతి మానవునియందు యీ మానవతావిలువలు నిజముగా వుంటుండాలి. వాటిని మనము తెప్పించుకోవాలి. అణగిపోయినదానిని మనము లేపాలి. అదే 'ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధత'. అజ్ఞానమనేదాంట్లో మునిగి మనలో వుండిన పవిత్రమైన మానవజ్యోతిని మనము మరచిపోతున్నాము. అజ్ఞానమును తొలగించుకుంటే జ్ఞానజ్యోతి వెలుగుతుంది. కనుక, నీతి రావాలనుకుంటే మొట్టమొదట ప్రీతి వుండాలి. పాప భయము వుండాలి. కనుక ప్రతి వ్యక్తి దైవప్రీతి, పాపభీతి, సమాజనీతి యీ మూడింటిని పెంచుకోవాలి. ఒకొక్క సమితియందు యింతవరకు జరిగిన సేవలనుగురించి యథార్థము మనము చెప్పుకోక తప్పదు. నాకు రెండూ, రెండు కన్నులే! స్త్రీలే యెక్కువ సేవలు చేశారు. స్త్రీలే యెక్కువ పనులు చేశారు. సాయిసంస్థలలోపల సరైన పేరు రావటానికి స్త్రీలే మూల కారణము. (మగవారు యెవరూ చప్పట్లు కొట్టటంలేదే!) స్త్రీలు త్యాగానికి పూనుకుంటారు. కనుక, స్త్రీలకుకూడను విద్యావిధానానికి బాలవికాస్, కొంతవరకు సేవలయందుకూడను, ఈ ఆధ్యాత్మిక విషయములందు వాళ్లకు చక్కని అవకాశము యివ్వాలి. ఆ స్త్రీలకుకూడను మూడు వింగులుగా పెట్టి యీ యొక్క ఆధ్యాత్మిక విషయమునందు, సేవలయందు, బాలవికాస్‌యందు వారుకూడను చక్కగా అభవృద్ధిగావిస్తారని ఆశిస్తున్నాను. వారియందున్న దోషాలుకూడను మనము యీనాడు తెలుసుకోవలసిందే! చాలా సేవలు

sri sathyasai vahini

చేస్తారు. త్యాగములో వారికి మించినవారు లేరు. ప్రేమలో ప్రాణాన్నైనా యిస్తారు. కానీ, హటంపడితే ప్రాణాన్నైనా తీస్తారు. ఇంకా కొంతమందిలో అసూయాభావము వుండటంచేత యింకా అభివృద్ధి తగ్గుతూ వస్తున్నాది. స్త్రీలు అధికారమునకు ప్రాకులాడే దానికంటే కర్తవ్యము నిర్వర్తించటమును గుర్తించాలి. నేను ప్రెసిడెంటు, నీవు సెక్రటరీ, నీవు వైస్‌ప్రెసిడెంటు - ఈ విధమైన అధికారదాహమునకు యేమాత్రము అవకాశము యివ్వరాదు. నువ్వు సేవకురాలే, ఆమె సేవకురాలే! ఒకరికొకరికి యే విధమైన భేదానికి అవకాశము లేదు.

### సంస్థలలో అధికారముకొరకు పోట్లాడుకోకుండా అందరూ కలిసిమెలసి పని చెయ్యాలి

కొన్ని కొన్ని చోట్ల సంస్థలలో అత్తాకోడళ్ల మాదిరి స్త్రీలు పోట్లాడుకోవడం జరుగుతూవుంటుంది. అత్తాకోడళ్ల విషయం ఒకటి చెబుతాను. ఇదే అవకాశము. తరువాత మీరెవరు చిక్కరింక. ఒక యింటిలో ఒక అత్తా, కోడలు, వుండేటువంటివారు. అత్త యేదో ఒక యింటికి పనివుండి పోయింది. ఆ సమయంలో ఒక భిక్షగాడు గుమ్మంముందు నిలబడి 'భవతీ బిక్షాందేహి', అన్నాడు. అప్పుడు యీ కోడలు తన అత్తగారి ఆర్డరు వుల్లఘించి పెట్టటానికి వీలులేదుకదా అని 'యేమీలేదు, పోయిరండి' అని చెప్పింది. సరిగా యీమె ఆ మాట చెప్పి పంపించే సమయములో అత్త లోపలికి వస్తూ ఈ విషయాన్ని గమనించింది. ఏమీ లేదని, పొమ్మని కోడలు చెప్పేసరికి ఆ బిక్షగాడు పోతున్నాడు, పాపం! అప్పుడు అతనిని వెనక్కు పిలిచి అడిగింది, అత్త 'ఆ అమ్మాయి యేమి చెప్పింది నీకు? అని. వెళ్లి రమ్మని చెప్పిందని చెప్పాడు. 'వెళ్లిరా అని చెప్పటానికి తనకెక్కడ అధికారము వుంది? ఛీ. ఆమె మాటలు నువ్వు యెందుకు వినాలి. తిరిగి నా యింటికి రా', అన్నది. ఆహా యేమో పెడుతుంది కదా యీ అత్తగారు అని వచ్చాడు ఆ భిక్షగాడు. అత్తగారు లోపలికి పోయి అర్ధగంటసేపు బయటకు రాలేదు. తరువాత బయటకువచ్చింది. 'ఇంకలేదు, వెళ్లిరా!' అంది. అనగా యేమిటి? బిక్షగానిని వెళ్లిరా అని చెప్పటానికి అత్తకే అధికారముగాని కోడలికిలేదనే అహంకారము. ఇద్దరు చేసిన పనీ ఒక్కటే! వానికేమింత భిక్షము వేయలేదు. అదే విధముగా యీ ఆడవారిలో ఒకరికొకరు నాకు అధికారము నీకు అధికారమని

sri sathyasai vachanamrutam

కట్టకడపటికి పని చేయడం మానుకుంటున్నారు. కనుక, అలాంటి భావములు మున్ముందు రాకుండా కలసిమెలసి పని చెయ్యాలి.

ఇందులాల్‌షా చెప్పినట్లుగా డిసెంబరు 1stనుండి తగిన మార్పులు, కూర్పులు చేసుకుని, సరైన పద్ధతిలో అభివృద్ధిగావించుకోవాలి. మరొక్క విషయము, World Council అనే పేరుతో పూర్వము జరిగేది. ఏదో అప్పుడు కొద్ది కొద్దిగా కార్యకలాపాలు జరుగుతుండటంచేత దాన్ని ఆ విధమైన రీతిలో అనుసరించటానికి అవకాశము చిక్కింది. ఇప్పుడు విదేశాల్లో భారతదేశముకంటె అధికముగా సంస్థాగత కార్యకలాపాలు పెరిగిపోయాయి. వీటి బాధ్యతంతా ఒక్క వ్యక్తి సాధించటమంటే వీలుకాదు. కనుక భారతదేశానికంతాకూడను ఒక Presidentను మనము పెట్టుకొని వివిధ దేశాలకు, ఆయాదేశాలకు తగినట్టుగా వారికే యీ బాధ్యత అప్పచెప్పి యీ World Council అనే దానిని యీనాడు తీసేశాము. కనుక యీ పేరుతో సంస్థ యింక నడచదు. ఆయాదేశములవారు అక్కడకూడను మన భారతదేశములో వున్నట్లుగా ఐదులేక ఆరుమంది చేరటము, ఆ దేశములో పరిస్థితులు, అక్కడి వాతావరణమునకు తగినట్లుగా, వారి పద్ధతికి తగినట్లుగా వారు చేసుకుంటూ పోవటం చాలా మంచిది. అయితే ఎవరిపాలిట వారిని వదలిపెడితే యిది అస్తవ్యస్తముగా మారిపోతుంది. కనుక అక్కడనుంచికూడను అక్కడ జరిగే కార్యక్రమాలగురించి ఇండియాకు తెలుపుతూ రావాలి. భారతదేశములో యేయే పద్ధతులను అనుసరిస్తున్నామో వారి వారి దేశకాలపరిస్థితుల ప్రభావాన్ని గురించి వారుకూడను ఆ పద్ధతులు కొంచెంవరకు అభివృద్ధిపరచుకోవాలి. కనుక అక్కడనుండికూడను ఇండియాకు ఆ పరిస్థితులు తెల్పాలి. ఆ ఆఫీసు యిప్పుడు ప్రశాంతినిలయం ఆఫీసు. ఈ విధమైన మార్పులు చేయటం దేనివల్లనంటే అభివృద్ధిగాంచుచున్న సాయి సంస్థలకు మరింత ప్రోత్సాహవుత్సాహములందించే నిమిత్తమై! ఈ విధంగా కొన్ని మార్పులు చేయవలసివచ్చిందే కాని వేరు కారణాలు మీరు యేమాత్రము చింతించకండి. మీరు వేరు భావములు పెట్టుకొని యేవేవో అనవసరమైన మాటలతో కాలమును వ్యర్థము చేయవద్దు. అంతే కాకుండా సంస్థల పేరుప్రతిష్ఠలకు మీరు యేమాత్రము హాని కలిగించకూడదు.

**స్వామికి సంస్థలతో యెట్టి సంబంధములేదు, భక్తులతో మాత్రమే వ్యక్తిగత సంబంధముంటుంది**

అందరూ ఒక్కటే! అందరూ దైవబిడ్డలుగా వుంటుండాలి. ఎవరియందు యెట్టి భేదములేదు. మానవత్వము కనుక అప్పుడప్పుడు కొన్ని కొన్ని దోషాలు, భేదములు రావచ్చును. కానీ, వాటిని మనము సరిచేసుకోవాలి. అదే మార్గములో మనము ముందుకు పోకూడదు. గడచిపోయిందేదో గడచిపోయింది. నడచుకునివచ్చిన రోడ్డు చూచుకొనే వచ్చాము. ఎదురు వచ్చే రోడ్డును చూడాలి. కనుక మీరందరుకూడను అక్కచెల్లెండ్రుగా వుంటుండి యీ సాయి సంస్థలలోపల సరైన ఆదర్శమును అందించటానికి సిద్ధముగా వుంటుండాలని నేను ఆశిస్తున్నాను. ఈ సంస్థలతో నాకు యెట్టి సంబంధము లేదు. మీకు మీరే చూచుకోవాలి. మీరు ఆనందిస్తుంటే ఆ ఆనందమును నేను ఆరగించటమే నా పని. మీకు, నాకు వ్యక్తిగతముగా యెప్పటికీ సంబంధమువుంటుంది. అయితే, Organisation తరఫునకూడను యీ సంబంధము మరింత అభివృద్ధి అయిపోతే మరింత ఆనందాన్ని అనుభవించవచ్చు. కనుక ముఖ్యముగా మీరు గుర్తించవలసినది యీ పదవుల మార్పులచేతగాని, కొన్ని పనుల మార్పుచేతగాని, మీరు నిరుత్సాహానికి చోటివ్వకుండా మరింత వుత్సాహమును అభివృద్ధిగావించుకొని యీయొక్క సంస్థలలోపలనే మీరు వుండి, దీర్ఘమైన ఆనందమును అనుభవించి, ఆదర్శమును అందించి జన్మసార్థకము చేసుకొని దీనిలో పాల్గొనాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. అయితే యీ జిల్లా అధికారులు, వీరికి సంబంధించిన కమిటీలు యీ మార్పులంతాకూడను యెవరెవరు యేయే రీతిగా వుంటారో అది కొంతకాలములోపలనే ఇందూలాల్‌షా అందిస్తారు.

**మున్ముందు ప్రపంచమంతా ప్రశాంతినిలయవాసులవుతారు**

మన అన్ని సేవలకంటె యీ సమిష్టి భజన అనే సేవ అందరి హృదయాల్లోపల శాశ్వతముగా నిల్చిపోతుంది. ఇతరమైన ఏ దానియందు ఒకరికొకరు కలవకపోయినప్పటికి యీ సమిష్టి భజనలలోపల అందరి వాక్కులు, అందరి హృదయాలు, అందరి



sri sathyasaivachanamrutam

సౌందుకూడను అందులో లీనమైపోతుంది. కనుక అందరూ భజనలో యీ unity అభివృద్ధిపరచి, హృదయాన్ని purity గావించి, దివ్యత్వమైన divinityని అందుకోటానికి అవకాశమువుంటుంది. కనుక, యీ భజనలో పాల్గొనాలి. మగవారుకూడను యీ భజన ట్రైనింగులు అధికముగా యివ్వాలి. ట్రైనింగు యెందుకంటే కొన్ని సంస్థలలోపల భజనలు పాడుతుంటారు. ఏరోప్లేనులో ప్రయాణం చేసేటప్పుడు ఆ శబ్దము భరించలేక చెవుల్లో దూది పెట్టుకుంటారు. అట్లా కొందరు భజన పాటలు పాడుతున్నప్పుడు చెవుల్లో ప్రత్తి పెట్టుకోవలసివస్తుంది. అంత అపస్వరముగా వుంటుంటాయి. భజన అనేది హృదయాన్ని కదలించి కరగించేటువంటిదిగా వుంటుండాలి. కనుక అందరికి యీ భజనలగురించి సరైన ట్రైనింగ్ యిచ్చే బాధ్యత స్త్రీలు తీసుకోవాలి. సేవలు, ఆధ్యాత్మికతత్త్వముతోకూడిన వుపన్యాసములు, దీనిలోపల మగవారు యెక్కువ బాధ్యత తీసుకోవాలి. సమాజముయొక్క పరిణామమంతా యీ పురుషులవల్లనే జరగాలి. స్త్రీలుకూడ వుండాలి. కాని ఆ బాధ్యత పురుషులపైనే అధికముగా వుంటుండాది. ఆ విధముగా వుండినప్పుడు మనము ఆనందమును యెంతైనా అనుభవించవచ్చును. మున్ముందు సాయి సంస్థలయొక్క సమావేశములు నిర్వహించడానికి ఆకాశమే పెండాలు, భూమియే వేదిక కావలసివస్తుంది. ఆ విధముగా మారిపోతుంది. Next conference యింక యిక్కడ పెట్టుకోటానికి వీలుకాదు. ఒకొక్క Stateలో ఒకొక్క conference పెట్టుకొని World Conference మాత్రం శాంతివేదికలోనే పెట్టుకోవలసివస్తుంది. మున్ముందు జరుగబోయేటి ఆశ్చర్యములను, ఆనందములను మీరు అనుభవించుకోటానికి గాను, మీరందరు ఆనంద హృదయులై యీ సేవలలో పాల్గొనండి. మున్ముందు యెంతైనా ఆనందము అనుభవిస్తారు. ప్రపంచమంతా ప్రశాంతి నిలయవాసులౌతారు. ఇలాంటి సద్భాగ్యాన్ని, సదవకాశమును నిలబెట్టుకొనే వీరులుగా మీరు తయారుకావాలి. ఇప్పటికే చాలావరకు సేవలు చేశారు. మిగతా సంస్థలతో, సాయి సంస్థలను పోలికచేసుకోటానికి యేమాత్రము అవకాశములేదు. గతంలో ఏదో కొన్ని పొరపాట్లు జరిగి వుండవచ్చు. వీటిని స్వామి క్షమించాడు. ఇకపైన ఆ పొరపాట్లు రాకుండా చూచుకోండి. అందరు కలసిమెలసి పని చేయండి. భారతదేశమునకు సత్కీర్తి తెండి. ఆధ్యాత్మికతత్త్వమంటే యింతటి పవిత్రమైనది, విశాలమైనది, ఆనందమయమైనది,

అని మనము చాటాలి. అన్ని దేశములలో భారతదేశము ఒక ఉన్నతస్థానములోవుండినది. ఆధ్యాత్మికతత్త్వమును అందరికి అందించటానికి మీరందరుకూడను ఉపాధ్యాయులుగా తయారుకావాలి. యింతే! మీ అందరికి నా ఆశీర్వాదములతో నా ప్రసంగమును ముగిస్తున్నాను.

**(తేదీ 24-11-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam